

మద్యం తయారీదారుల అరెస్ట్
నకిలీ మద్యం తయారు చేస్తున్న ఏడుగురిపై పోలీసులు కేసు నమోదు చేయడంతోపాటు ఐదుగురిని అరెస్ట్ చేశారు. - 8లో



వరికోత మిషన్ దగ్ధం
కేతేపల్లి మండలం చెర్కుపల్లి గ్రామంలో ఇంజన్‌లో మంటలు చెలరేగి వరికోత మిషన్ దగ్ధమైంది. - 8లో



కళాకారులకు ఆదరణ కరువు
కళల ద్వారా వినోదం, ఆనందం పంచుతున్న రంగస్థల కళాకారుల కుటుంబాలకు నేడు ఆదరణ కరువైంది. - 8లో

ధాన్యం రైతు దిగాలు!

ప్రభుత్వ కేంద్రాల్లో నత్తనడకన కొనుగోళ్లు

- కొన్నిచోట్ల అసలు ప్రారంభంకాని కేంద్రాలు..
- ప్రారంభించిన చోట కొనుగోళ్లకు కొర్రీలు
- కేంద్రాలకు వచ్చిన ధాన్యం 76,716 మెట్రిక్ టన్నులు
- కొనుగోలు చేసింది 2,269 మెట్రిక్ టన్నులే..
- మిల్లులకే వెళ్తున్న సన్న ధాన్యం పండించిన రైతులు

నల్లగొండ : యాసంగి సీజన్ ధాన్యం కొనుగోళ్లు నత్తనడకన సాగుతున్నాయి. వరి కోతలు ప్రారంభమై నెల రోజులు కావస్తున్నా.. కొన్ని చోట్ల కేంద్రాలు ప్రారంభమే కాలేదు. ఇక.. కేంద్రాలు ప్రారంభించిన చోట ధాన్యం కాంటా వేసేందుకు నిర్వాహకులు అనేక కొర్రీలు పెడుతున్నారు. జిల్లాలోని కేంద్రాలకు ఇప్పటి వరకు 76,716 మెట్రిక్ టన్నుల ధాన్యం రాగా.. కేవలం 2,269 మెట్రిక్ టన్నులే కొనుగోలు చేశారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. నిర్దేశిత తేమ శాతం రావడంలేదని నిర్వాహకులు చెబుతుండగా.. కొన్ని కేంద్రాల్లో హమాలీలు, బస్తాలు లేవన్న కారణంతో కొనుగోలు చేయడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీంతో కేంద్రాల వద్ద రైతులకు పడిగాపులు తప్పడం లేదు. ఇక సన్నధాన్యం పండించిన రైతులు ఎక్కడా కేంద్రాల వద్దకు రావడం లేదు. నేరుగా మిల్లర్లకు ధాన్యం విక్రయించుకుంటున్నారు.



శాలిగౌరారం మండలం భైరవునిబండ ఐకేపీ కేంద్రంలో ధాన్యం రాశులు

180 కేంద్రాలు ప్రారంభం

జిల్లాలో యాసంగి సాగు ముందస్తుగా ప్రారంభమైంది. ఈ సీజన్‌లో ఏడున్నర లక్షల పైచిలుకు ధాన్యం మార్కెట్‌కు వస్తుందని అధికారులు అంచనా వేశారు. ధాన్యం కొనుగోలుకు 375 కేంద్రాలు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. మార్చి 24వ తేదీన రాష్ట్రంలోనే మొదట నల్లగొండ జిల్లాలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఇప్పటి వరకు 180 కొనుగోలు కేంద్రాలు ప్రారంభమయ్యాయి. ఆయా కేంద్రాలకు 76,716 మెట్రిక్ టన్నుల ధాన్యం వచ్చింది. కేంద్రాలకు వచ్చిన ధాన్యం కొనుగోలు చేయడంలో జాప్యం జరుగుతోంది. 2,269 మెట్రిక్ టన్నులే కొనుగోలు చేసినా దానికి సంబంధించి ట్యాబ్ ఎంట్రీ, మిల్లులకు ట్రాన్స్‌పోర్టు కూడా వేగంగా సాగడం లేదు. ధాన్యం తేమశాతం వచ్చిన వెంటనే కొనుగోలు చేయడంలో క్షేత్రస్థాయి సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. మరికొన్ని చోట్ల ఇంకా మిల్లుల కేటాయింపు కూడా చేపట్టలేదని తెలుస్తోంది.



ఈ ఫొటోలోని రైతు శాలిగౌరారం మండలం భైరవునిబండ గ్రామానికి చెందిన యాదగిరిరెడ్డి. ఈ రైతు సాగు చేసిన వరి పంటను మార్చి 4న కోత కోసి గ్రామంలోని ఐకేపీ కొనుగోలు కేంద్రానికి తరలించాడు. ధాన్యం మొత్తాన్ని ఆరబోసి రాశి చేశాడు. కానీ ఈ గ్రామంలోని కేంద్రం ఇప్పటి వరకు ప్రారంభించలేదు. అసలు మిల్లు ట్యాగింగ్, రవాణా సౌకర్యాల కల్పనపై ఎలాంటి ఉత్తర్వులు రాలేదు. కేంద్రానికి ఈ రైతు ధాన్యం తెచ్చి నెలరోజులవుతున్నా.. ఇప్పటి వరకు కాంటా వేయకపోవడంతో రోజు రాశి వద్దే పడిగాపులు కాస్తున్నాడు. ప్రస్తుతం అకాల వర్షాల సీజన్ కావడంతో వర్షం పడితే ధాన్యం తడిసి దెబ్బతింటుందని ఆందోళన చెందుతున్నాడు. ఇదీ జిల్లాలో కొనుగోలు కేంద్రాల వద్ద పరిస్థితి.

మిల్లుల బాట పడుతున్న రైతులు..

ప్రభుత్వ కేంద్రాల్లో ధాన్యం అమ్ముకోవాలంటే రోజుల తరబడి అక్కడ కాపాలా ఉండాల్సి వస్తోంది. అక్కడ అన్ని సౌకర్యాలు లేకపోగా.. నిర్వాహకులు రకరకాల కారణాలతో ధాన్యం కాంటా వేయడం లేదు. వాతావరణంలో మార్పులతో అకాల వర్షాలు వచ్చే అవకాశాలు ఉండడంతో సన్న ధాన్యంతోపాటు దొడ్డు ధాన్యం పండించిన రైతులు కూడా మిల్లుల వైపు వెళ్తున్నారు. ఇదే అదునుగా భావిస్తున్న మిల్లర్లు ధాన్యం ధర భారీగా తగ్గించి కొనుగోలు చేస్తున్నారు.



మునుగోడులోని రైస్ మిల్లులో తక్కువ ధరకు ధాన్యం అమ్ముకునేందుకు క్యూ కట్టిన రైతుల ట్రాక్టర్లు

పది రోజుల నుంచి ఎదురుచూస్తున్న



నేను సాగుచేసిన పదెకరాల వరి పొలం పది రోజుల క్రితం కోసి వచ్చిన ధాన్యాన్ని మా గ్రామంలో ఎంపిక చేసిన కొనుగోళ్ల కేంద్రం స్థలంలో పోశాను. ఎప్పుడు ప్రారంభిస్తారో కూడా అధికారులు చెప్పడం లేదు. రోజూ మబ్బులు వస్తుండడంతో వర్షం వస్తే ధాన్యం తడుస్తుందోనని భయంగా ఉంది. ఇప్పటికైనా అధికారులు కేంద్రాన్ని ప్రారంభించి వెంటనే తూకం వేస్తే బాగుండు.

– గట్టుపల్లి రామానుజరెడ్డి, రైతు, కల్వపల్లి

ఇంకా ప్రారంభించ లేదు



ఐకేపీ కేంద్రానికి ధాన్యం తీసుకొచ్చి వారం అయ్యింది. ఇప్పటివరకు కొనుగోళ్లు ప్రారంభించ లేదు. మబ్బులు కమ్ముకొస్తున్నాయి. ఎప్పుడు వర్షం వస్తుందో తెలియక ఆందోళన చెందుతున్నాం. తక్షణమే ధాన్యాన్ని కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలి.

– ఎల్లుట్ల రాములు, రైతు, ఆగామోత్కూర్



శ్రీరామనవమి వేడుకల్లో భాగంగా ఆదివారం నల్లగొండలోని రామగిరి రామాలయంలో శ్రీసీతారామచంద్రస్వామి కల్యాణానికి పట్టువస్త్రాలు సమర్పించేందుకు వస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి, భవేష్‌మిశ్రా దంపతులు



కల్యాణ ఘట్టంలో భాగంగా మాంగళ్యధారణ తంతు నిర్వహిస్తున్న అర్చకులు

కమనీయం.. సీతారాముల కల్యాణం



కల్యాణమూర్తులు



కల్యాణం అనంతరం సీతారామచంద్రస్వామిని ఊరేగింపుగా తీసుకొస్తున్న భక్తులు

తెలంగాణ లోకాయుక్తగా పెద్దవూర మండల వాసి

- శిర్సనగండ్ల గ్రామానికి చెందిన యడవెల్లి రాజశేఖర్‌రెడ్డి పేరు ఖరారు
- రాజ్‌భవన్‌కు చేరిన ప్రతిపాదనలు
- ఒకటి రెండు రోజుల్లో జారీకానున్న ఉత్తర్వులు



జస్టిస్ యడవెల్లి రాజశేఖర్‌రెడ్డి

పెద్దవూర: నల్లగొండ జిల్లా పెద్దవూర మండలం శిర్సనగండ్ల గ్రామానికి చెందిన హైకోర్టు రిటైర్డ్ న్యాయమూర్తి జస్టిస్ యడవెల్లి రాజశేఖర్‌రెడ్డి తెలంగాణ లోకాయుక్తగా నియమితులయ్యారు. శిర్సనగండ్ల గ్రామానికి చెందిన రైతు యడవెల్లి రామాంజిరెడ్డి–జయప్రద దంపతులకు ఐదుగురు సంతానం కాగా.. రాజశేఖర్‌రెడ్డి పెద్దవారు. ఆయన 1960 మే 4వ తేదీన జన్మించారు. రాజశేఖర్‌రెడ్డి ప్రాథమిక విద్యాభ్యాసం మిర్యాలగూడలోని సెయింట్ మేరీ పాఠశాలలో, 6 నుంచి 10వ తరగతి వరకు నల్లగొండలోని సెయింట్ ఆల్ఫోన్సెస్ పాఠశాలలో, ఇంటర్మీడియట్ హైదరాబాద్‌లోని ఏవీఎం కళాశాలలో, బీఎస్సీ డిగ్రీ, ఎల్ఎల్‌బీ వరంగల్‌లో సాగాయి. ఆ రోజుల్లోనే ఆయన విద్యాభ్యాసం అంతా ఇంగ్లిష్ మీడియంలో సాగింది. డిగ్రీ సైన్స్‌లో చేసినప్పటికీ బాబాయి కొండల్‌రెడ్డి అడ్వకేట్‌గా స్థిరపడటంతో ఆయనను ఆదర్శంగా తీసుకుని రాజశేఖర్‌రెడ్డి ఎల్ఎల్‌బీ పూర్తి చేశారు. కాకతీయ విశ్వవిద్యాలయం నుంచి న్యాయశాస్త్రంలో బంగారు పతకం సాధించారు. ఎల్ఎల్‌బీ పూర్తికాగానే 1985లో మొదట నల్ల గొండలో న్యాయవాదిగా ఒక సంవత్సరం పాటు ప్రాక్టీస్ చేశారు. అనంతరం హైదరాబాద్‌కు వెళ్లి అక్కడే న్యాయవాదిగా 1985 ఏప్రిల్‌లో ఏపీ బార్ కౌన్సిల్‌లో ఎన్‌రోల్ చేసుకుని ప్రాక్టీస్ మొదలు పెట్టారు. తొలుత మహమూద్ అలీ వద్ద ప్రాక్టీస్ చేశారు. అనంతరం స్వతహాగా ప్రాక్టీస్ ప్రారంభించారు. 2004లో హైకోర్టు న్యాయవాదుల సంఘం ఉపాధ్యక్షుడిగా, అదే ఏడాది కేంద్ర ప్రభుత్వానికి సీనియర్ స్టాండింగ్ కౌన్సిల్‌గా, 2005లో అసిస్టెంట్ సొలిసిటర్ జనరల్‌గా నియమితులయ్యారు. సెంట్రల్ ఎక్సైజ్, సాఫ్ట్‌వేర్ టెక్నాలజీ పార్క్స్ ఆఫ్ ఇండియాకు న్యాయవాదిగా కూడా పనిచేశారు. 2013 ఏప్రిల్ 12వ తేదీన ఆంధ్రప్రదేశ్ హైకోర్టు అదనపు న్యాయమూర్తిగా నియమితులైన ఆయన 2014లో శాశ్వత న్యాయమూర్తిగా నియమితులై 2022 ఏప్రిల్‌లో పదవీ విరమణ చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి, శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌తో కూడిన ఎంపిక కమిటీ సమావేశమై లోకాయుక్తగా యడవెల్లి రాజశేఖర్‌రెడ్డి పేరును ఖరారు చేసి రాజ్‌భవన్‌కు పంపింది. ఒకటి, రెండు రోజుల్లో నియామక ఉత్తర్వులు జారీ కానున్నాయి.

స్వగ్రామంతో అనుబంధం కొనసాగిస్తూ..

శిర్సనగండ్ల గ్రామానికి పండుగలకు, శుభకార్యాలకు తరచూ రాజశేఖర్‌రెడ్డి వస్తుంటారని గ్రామస్తులు తెలిపారు. ఆయనకు సోదరులు యడవెల్లి దేవేందర్‌రెడ్డి, రఘుపతిరెడ్డి, దిలీప్‌రెడ్డి, సోదరి మంజుల ఉన్నారు. వీరిలో దేవేందర్‌రెడ్డి, రఘుపతిరెడ్డి శిర్సనగండ్ల గ్రామంలోనే ఉంటూ వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తుండగా.. దిలీప్‌రెడ్డి అమెరికాలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పనిచేస్తున్నాడు. ఆస్తి పంపకాల్లో రాజశేఖర్‌రెడ్డికి అనుముల మండలం కొసలమర్రి గ్రామంలో 12 ఎకరాల పొలం వచ్చింది. దీనిలో బత్తాయి తోట సాగుచేస్తూ తరచూ ఇక్కడికి వచ్చి వెళ్తుంటారు. స్వగ్రామంలో తనకంటూ కొంత భూమి ఉండాలన్న ఉద్దేశ్యంతో ఈ మధ్యనే శిర్సనగండ్లలో రాజశేఖర్‌రెడ్డి మూడెకరాల వ్యవసాయ భూమి కొనుగోలు చేసినట్లు ఆయన సోదరుడు దేవేందర్‌రెడ్డి తెలిపారు. రాజశేఖర్‌రెడ్డి చిన్నతనం నుంచి చదువులో మంచి ప్రతిభ కనపర్చేవారని కూడా పేర్కొన్నారు. తమ గ్రామానికి చెందిన వ్యక్తి లోకాయుక్తగా నియామకం కావడంతో శిర్సనగండ్ల గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

నేటి నుంచి టెన్త్ మూల్యాంకనం

- 16వ తేదీ వరకు నిర్వహణ
- జిల్లాకు 2,21,667 జవాబు పత్రాలు కేటాయింపు

నల్లగొండ : పదో తరగతి మూల్యాంకనం నేటి నుంచి నుంచి 16వ తేదీ వరకు నిర్వహించనున్నారు. నల్లగొండలోని లిటిల్ ఫ్లవర్ పాఠశాలలో వాటిని మూల్యాంకనం చేయనున్నారు. అందుకోసం జిల్లా విద్యాశాఖ అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. జిల్లాకు 2,21,667 జవాబు పత్రాలు కేటాయించారు. మూల్యాంకన విధుల కోసం చీఫ్ ఎగ్జామినర్లు 106 మంది, అసిస్టెంట్ ఎగ్జామినర్లు 616, స్పెషల్ అసిస్టెంట్లు 212, ఏసీఓలుగా ఏడుగురిని.. మొత్తం 941 మంది నియమించారు. వారంతా 7వ తేదీ ఉదయం 8 గంటలకు స్పాట్ వాల్యుయేషన్ కేంద్రంలో రిపోర్ట్ చేయాల్సి ఉంటుంది. మొదటి రోజు ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ట్రెనింగ్ ఇవ్వనున్నారు. ఆ తర్వాత మూల్యాంకనం ప్రారంభమవుతుంది. 8వ తేదీ నుంచి రోజూ ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు మూల్యాంకనం సాగనుంది.

ప్రతి రోజు 40 పేపర్లు..

ప్రతి ఎగ్జామినర్ రోజూ 40 పేపర్లు మూల్యాంకనం చేయాల్సి ఉంటుంది. ఉదయం 20 పేపర్లు, సాయంత్రం 20 పేపర్ల చొప్పున వారికి ఇవ్వనున్నారు. ఈ మూల్యాంకనానికి స్పాట్ క్యాంపు ఆఫీసర్‌గా డీఈఓ, అసిస్టెంట్ క్యాంపు ఆఫీసర్లుగా ఎంఈఓలతో పాటు సీనియర్ ప్రధానోపాధ్యాయులు వ్యవహరించనున్నారు. చీఫ్ ఎగ్జామినర్లు హెచ్ఎంలు విధులు నిర్వహించనున్నారు. ఈ ప్రక్రియను జిల్లా పరీక్షల విభాగం అసిస్టెంట్ కమిషనర్ యూసుఫ్ షరీఫ్ పర్యవేక్షించనున్నారు.

హాజరు కాకుంటే శాఖాపరమైన చర్యలు



ఇప్పటికే స్పాట్ వాల్యుయేషన్ కోసం సంబంధిత ఉపాధ్యాయులకు ఆర్డర్లు ఇచ్చాం. హాజరు కాని వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటాం. మూల్యాంకనం కేంద్రంలోకి సెల్‌ఫోన్ అనుమతి లేదు. అందరూ ఐడీ కార్డులతో హాజరు కావాలి. మూల్యాంకనానికి సహకరించి సజావుగా పూర్తి చేసేందుకు సహకరించాలి. – భిక్షపతి, డీఈఓ

న్యూస్‌రీల్

ఘనంగా బీజేపీ ఆవిర్భావ దినోత్సవం



జెండా ఎగుర వేస్తున్న నాగం వర్షిత్‌రెడ్డి

నల్లగొండ టూటౌన్ : బీజేపీ ఆవిర్భావ దినోత్సవం ఆదివారం నల్లగొండ పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. పార్టీ కార్యాలయ ఆవరణలో బీజేపీ జెండాను ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ నాగం వర్షిత్‌రెడ్డి ఎగురవేశారు. అనంతరం పార్టీ నాయకులు స్వీట్లు తినిపించుకున్నారు. ఈ సందర్భంగా వర్షిత్‌రెడ్డి మాట్లాడుతూ బీజేపీ దేశం కోసం, ప్రజల అభ్యున్నతి కోసం పని చేస్తుందన్నారు. దేశాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి చూపించిన ఘనత ప్రధానమంత్రి నరేంద్రమోదీకే దక్కిందన్నారు. కార్యక్రమంలో నాయకులు గోలి మధుసూదన్‌రెడ్డి, వీరెల్లి చంద్రశేఖర్, పిల్లి రామరాజుయాదవ్, పోతెపాక లింగస్వామి, లోకనబోయిన రమణ, పకీరు మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అణగారిన వర్గాల అభ్యున్నతికి పాటుపడతాం



సత్యంను సన్మానిస్తున్న మిత్రులు

నల్లగొండ టౌన్ : కష్టజీవులు, పేదలు, అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం నిరంతరం పాటు పడతానని ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం పేర్కొన్నారు. ఆదివారం సీపీఐ కార్యాలయంలో ఆయనతో కమ్యూనిస్టు ఉద్యమ ప్రస్థానంలో పాలు పంచుకుంటున్న మిత్రులు, ఎమ్మెల్సీ సత్యంను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుదీర్ఘ కమ్యూనిస్టు ఉద్యమ ప్రస్థానంలో పార్టీ సభ్యులు, మిత్రులు అందించిన సహకారంతో ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు తనవంతు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో కుంభం కృష్ణారెడ్డి, కట్టా వెంకట్‌రెడ్డి, గుర్రం వెంకట్‌రెడ్డి, కందుల భిక్షం, నర్సింహాచారి, ప్రద్యుమ్నారెడ్డి, మేకల రవీందర్‌రెడ్డి, బొమ్మరబోయిన వెంకన్న, బరిగెల నగేష్, లింగారెడ్డి, నర్సింహ, పల్లా దేవేందర్‌రెడ్డి, లొడంగి శ్రవణ్‌కుమార్, పబ్బు వీరస్వామి పాల్గొన్నారు.

క్లుప్తంగా

అనారోగ్య కారణాలతో వృద్ధుడి ఆత్మహత్య



రాములు (ఫైల్)

చౌటుప్పల్: అనారోగ్య కారణాలతో ఉరేసుకుని వృద్ధుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలోని తంగడపల్లి గ్రామంలో ఆదివారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తంగడపల్లి గ్రామానికి చెందిన లింగాల రాములు(85)కు ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. ఈ నెల 2న తిరుపతికి వెళ్లే క్రమంలో హైదరాబాద్‌లో ఉంటున్న తన వద్ద ఉంటున్న రాములును అతడి కుమారుడు చౌటుప్పల్‌లో నివాసముంటున్న తన సోదరి సరస్వతి ఇంట్లో వదిలిపెట్టాడు. ఈ నెల 4న పెన్షన్ తీసుకునేందుకు స్వగ్రామమైన తంగడపల్లికి రాములు వెళ్లాడు. ఆదివారం ఉదయం కుమారుడు రాములుకు ఫోన్ చేయగా లిఫ్ట్ చేయకపోవడంతో పక్కింటి వారికి సమాచారం అందించాడు. వారు వెళ్లి చూడగా ఇంట్లో ఉరేసుకుని రాములు మృతిచెంది ఉన్నాడు. మృతుడి కుమారుడు భిక్షపతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ మన్మథకుమార్ తెలిపారు.

ఉరేసుకుని వ్యక్తి..

పెన్‌పహాడ్: ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన పెన్‌పహాడ్ మండలం సింగారెడ్డిపాలెం గ్రామంలో ఆదివారం జరిగింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. సింగారెడ్డిపాలెంకు చెందిన గునగంటి జనార్దన్(36) ఆదివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి భార్య చంద్రకళ, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు. ఈ ఘటనకు సంబంధించి పోలీసులను సంప్రదించగా స్పందించలేదు.

అప్పుల బాధతో యువకుడి బలవన్మరణం



అరవింద్ (ఫైల్)

పెద్దఅడిశర్లపల్లి: అప్పుల బాధ తాళలేక పురుగుల మందు తాగి యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన పెద్దఅడిశర్లపల్లి మండలం అజ్మాపురం గ్రామంలో ఆదివారం జరిగింది. గుడిపల్లి ఎస్ఐ నర్సింహులు తెలిపిన వివరాల ప్రకారం.. నేరేడుగొమ్ము మండలం చిన్నమునిగల్ గ్రామానికి చెందిన కేతావత్ అరవింద్(27) అప్పుల బాధ తాళలేక ఆదివారం పెద్దఅడిశర్లపల్లి మండలం అజ్మాపురం గ్రామంలోని పుష్కర ఘాట్ వద్ద పురుగుల మందు తాగాడు. అనంతరం భార్యకు వీడియోకాల్ చేసి తాను పురుగుల మందు తాగినట్లు చెప్పాడు. కుటుంబ సభ్యులు వెంటనే పుష్కర ఘాట్ వద్దకు చేరుకుని అపస్మారక స్థితిలో ఉన్న అరవింద్‌ను దేవరకొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. మృతుడికి భార్య, కుమారుడు ఉన్నారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి

మిర్యాలగూడ టౌన్: వ్యవసాయ బావి వద్ద గడ్డి కోస్తుండగా విద్యుదాఘాతానికి గురై రైతు మృతిచెందాడు. ఈ ఘటన ఆదివారం మిర్యాలగూడ మండలం శ్రీనివాసనగర్ గ్రామ సమీపంలో జరిగింది. మిర్యాలగూడ రూరల్ ఎస్ఐ మల్లికంటి లక్ష్మయ్య తెలిపిన వివరాల ప్రకారం.. దుబ్బతండా గ్రామానికి చెందిన రైతు మాలోతు భద్రు(60) ఆదివారం శ్రీనివాస్‌నగర్ గ్రామ సమీపంలో గల మాలోతు బాలు పొలంలో పచ్చగడ్డి కోస్తుండగా.. ప్రమాదవశాత్తు కొడవలి పక్కనే ఉన్న బోరు మోటారు వైరుకు తగలడంతో విద్యుదాఘాతానికి గురై మృతిచెందాడు. భద్రు ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు పొలం వద్దకు వెతుక్కుంటూ వెళ్లగా విగతజీవిగా కనిపించాడు. సమాచారం అందుకున్న మిర్యాలగూడ రూరల్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతుడి కుమారుడు మాలోతు లచ్చుసాద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

నకిలీ మద్యం తయారీదారుల అరెస్ట్

- 600 లీటర్ల స్పిరిట్, 660 లీటర్ల నకిలీ మద్యం స్వాధీనం
- వివరాలు వెల్లడించిన నల్లగొండ ఎస్పీ శరత్‌చంద్ర పవార్



వివరాలు వెల్లడిస్తున్న నల్లగొండ ఎస్పీ శరత్‌చంద్ర పవార్



నకిలీ మద్యాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ శరత్‌చంద్ర పవార్

నల్లగొండ: నకిలీ మద్యం తయారుచేస్తున్న ఏడుగురిపై కేసు నమోదు చేయడంతో పాటు ఐదుగురిని అరెస్ట్ చేసి, వారి నుంచి 600 లీటర్ల స్పిరిట్, మరో 660 లీటర్ల నకిలీ మద్యం స్వాధీనం చేసుకున్నట్లు నల్లగొండ ఎస్పీ శరత్‌చంద్ర పవార్ తెలిపారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను ఆదివారం నల్లగొండ జిల్లా ఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వెల్లడించారు. ఎస్పీ తెలిపిన వివరాల ప్రకారం.. నల్లగొండ జిల్లా చండూరు మండల కేంద్రానికి జానీపాషా గతంలో హైదరాబాద్‌లోని చైతన్యపురిలో మటన్ షాప్‌లో పనిచేసేవాడు. అతడికి రంగారెడ్డి జిల్లా తుర్కయంజాల్‌కు చెందిన శ్రీనివాస్‌తో పరిచయం ఏర్పడింది. అదే క్రమంలో 2016లో శ్రీనివాస్ బావమర్ది అయిన కర్ణాటక రాష్ట్రం బెంగళూరుకు చెందిన శ్రీనివాస్‌గౌడ్ తోనూ పరిచయం ఏర్పడింది. శ్రీనివాస్‌గౌడ్ కర్ణాటక నుంచి ముడిసరుకు తెచ్చి హైదరాబాద్ శివారులో నకిలీ మద్యం తయారు చేస్తుండటంతో 2019లో అతడిపై కేసులు నమోదయ్యాయి. ఆరు నెలల క్రితం శ్రీనివాస్‌గౌడ్ కర్ణాటక నుంచి హైదరాబాద్‌లో ఉంటున్న జానీపాషాకు ఫోన్ చేసి రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో మద్యం ఎక్కువగా అమ్ముడుపోతుందని, కావున ఏదైనా అనువైన ప్రదేశం చూపితే నకిలీ మద్యం తయారు చేస్తానని చెప్పాడు. దీంతో జానీపాష తనకు పరిచయస్తులైన నల్లగొండ జిల్లా చండూరుకు చెందిన ఎర్రజెల్ల రమేష్, దోమలపల్లి యాదగిరి అలియాస్ మంగళగిరికి విషయం చెప్పాడు. వీరు ముగ్గురు కలిసి నల్లగొండ జిల్లా నాంపల్లి మండలం గానుగుపల్లిలో గల ఎర్రజెల్ల రమేష్‌కు చెందిన తోటలో నకిలీ మద్యం తయారుచేద్దామని నిర్ణయించుకున్నారు.

క్యాన్లలో నకిలీ మద్యం నింపి..

జానీపాషా, రమేష్, యాదగిరి కలిసి శ్రీనివాస్‌గౌడ్‌తో మాట్లాడి ఈ ఏడాది ఫిబ్రవరి మొదటి వారంలో నకిలీ మద్యం తయారుచేసేందుకు నిర్ణయించుకుని 5 డ్రమ్ముల స్పిరిట్ తెచ్చి తోటలో పెట్టారు. ముగ్గురు కలిసి రూ.6లక్షలు శ్రీనివాస్‌గౌడ్‌కు ఇచ్చారు. శ్రీనివాస్‌గౌడ్ చెప్పిన విధంగా ముగ్గురు కలిసి 40 బిస్లరీ క్యాన్లు తీసుకొచ్చారు. 2 స్పిరిట్ డ్రమ్ముల్లో శ్రీనివాస్‌గౌడ్ తెచ్చిన 3 రకాల ఫ్లేవర్స్‌ను కలిపి కల్తీ మద్యాన్ని తయారు చేశారు. ఈ నకిలీ మద్యాన్ని 40 బిస్లరీ క్యాన్లలో(ఒక్కోటి 20 లీటర్లు) నింపి 2, 3 రోజులు పులియబెట్టి తర్వాత ఒక్కో క్యాన్ రూ.10 వేలకు విక్రయించాలని శ్రీనివాస్‌గౌడ్ చెప్పాడు. అలా ఈ ముగ్గురు కలిసి మునుగోడులోని వైన్ షాపుల్లో పార్ట్‌నర్ అయిన జాజుల వెంకటేష్‌ను కలిసి మద్యం సరఫరా చేస్తామని చెప్పగా.. ప్యాకింగ్ సరిగ్గా లేదని అతడు తిరస్కరించారు. ఆ తర్వాత ఎర్రజెల్ల రమేష్ వారి అత్తగారి ఊరైన కనగల్ మండలం జి.ఎడవల్లిలో తనకు పరిచయమున్న బొమ్మరబోయిన భార్గవ్‌ను సంప్రదించగా అతడు రూ.10వేలు ఇచ్చి 20 లీటర్ల క్యాన్లు 4 తీసుకుని.. తనకు తెలిసిన బెల్ట్ షాపుల నిర్వాహకులను సంప్రదించగా వారు కూడా తీసుకునేందుకు నిరాకరించారు. జానీపాషా డ్రైవర్ సాయం ఉపేంద్రకు డబ్బులు ఇస్తామని చెప్పి.. నకిలీ మద్యాన్ని ఆటోలో తాము చెప్పిన ప్రాంతానికి చేరవేయాలని చెప్పారు. ఈవిధంగా కల్తీ మద్యం తయారు చేసి సరఫరా చేసే క్రమంలో పక్కా సమాచారం మేరకు వీరిని పట్టుకుని విచారించగా నేరం ఒప్పుకున్నట్లు ఎస్పీ వివరించారు. వీరిపై నాంపల్లి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి ఎర్రజెల్ల రమేష్, మహ్మద్ జానీపాషా, సాయం ఉపేంద్ర, జాజుల వెంకటేష్, బొమ్మరబోయిన భార్గవ్‌ను అరెస్ట్ చేశామని, శ్రీనివాస్‌గౌడ్, దోమలపల్లి యాదగిరి అలియాస్ మంగళగిరి పరారీలో ఉన్నట్లు ఎస్పీ తెలిపారు. అదేవిధంగా చండూరు మండలం దుబ్బగూడెం గ్రామంలో 20 క్యాన్ల నకిలీ మద్యం స్వాధీనం చేసుకుని చండూరు ఎక్సైజ్ పోలీసులు కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. దేవరకొండ ఏఎస్పీ మౌనిక, టాస్క్‌ఫోర్స్ సీఐ రమేష్‌బాబు, ఎస్ఐలు మహేందర్, శివప్రసాద్, నాంపల్లి సీఐ రాజు ఆధ్వర్యంలో నేరస్తులను పట్టుకున్న ఎస్ఐ శోభన్ బాబు, నాంపల్లి పోలీస్ స్టేషన్ సిబ్బంది, ఎక్సైజ్ పోలీసులను ఎస్పీ అభినందించారు.

మద్యం మత్తులో కత్తితో దాడి

- ఇద్దరికి గాయాలు
- పోలీసుల అదుపులో నిందితుడు



గాయపడిన ఉపేందర్‌రెడ్డి, రాము

త్రిపురారం: మద్యం మత్తులో ఓ వ్యక్తి కల్లు గీసే కత్తితో దాడి చేయడంతో ఇద్దరు వ్యక్తులకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన త్రిపురారం మండలం కొణతాలపల్లి గ్రామ శివారులో శనివారం రాత్రి జరిగింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. త్రిపురారం మండలం కంపాసాగర్ గ్రామ పంచాయతీ పరిధిలోని కోమటిగూడెం గ్రామానికి చెందిన సూకల ఉపేందర్‌రెడ్డి ట్రాక్టర్ షోరూంలకు జనరల్ మేనేజర్‌గా పనిచేస్తూ నల్లగొండలో నివాసముంటున్నారు. శనివారం సెలవు ఉండడంతో తన ఇద్దరు పిల్లలతో పాటు తనతో పనిచేసే రాము అనే వ్యక్తితో కలిసి కారులో కోమటిగూడేనికి వచ్చారు. తిరుగు ప్రయాణంలో సాయంత్రం కొణతాలపల్లి శివారులో కల్లు అడ్డా వద్ద జక్కల సైదులు అనే వ్యక్తి రోడ్డుకు అడ్డంగా పడుకోవడంతో కారు పోయేందుకు వీలేకాలేదు. ఉపేందర్‌రెడ్డి పక్కకు జరగమని అనడంతో అప్పటికే మద్యం మత్తులో ఉన్న సైదులు అక్కడే ఉన్న కల్లు గీత కార్మికుడి వద్ద ఉన్న కత్తి తీసుకొని ఉపేందర్‌రెడ్డిపై దాడి చేశాడు. కారులో ఉన్న రాము వచ్చి అడ్డుపడగా అతడిపై కూడా దాడి చేశాడు. ఉపేందర్‌రెడ్డి పిల్లలు కారులోంచి కిందకు దిగడంతో స్థానికులు తిరిగి వారిని కారులో కూర్చోబెట్టారు. ఉపేందర్‌రెడ్డి, రాముకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని నిందితుడిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. క్షతగాత్రులు నల్లగొండలోని ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఉపేందర్‌రెడ్డిపై దాడి జరిగినట్లు తెలుసుకున్న కోమటిగూడెం వాసులు ఘటనా స్థలానికి చేరుకొని దాడి చేసిన వ్యక్తిని కొట్టడంతో అతడికి గాయాలైనట్లు తెలిసింది. ఈ ఘటనపై ఉపేందర్‌రెడ్డి భార్య కవిత త్రిపురారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ విషయమై పోలీసులను ఫోన్‌లో సంప్రదించగా స్పందించలేదు.

బ్రెయిన్‌స్ట్రోక్‌తో చేనేత కార్మికుడు మృతి



రాజు (ఫైల్)

భూదాన్‌పోచంపల్లి: పోచంపల్లి పట్టణ కేంద్రంలోని వినోబాభావేనగర్‌కు చెందిన చేనేత కార్మికుడు వల్లభదాసు రాజు(53) బ్రెయిన్‌స్ట్రోక్‌తో శనివారం రాత్రి మృతిచెందాడు. రాజు ఈ నెల 4న బ్రెయిన్ స్ట్రోక్‌కు గురయ్యాడు. కుటుంబ సభ్యులు వెంటనే హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. కోమాలోకి వెళ్లిన రాజుకు శస్త్రచికిత్స చేయాలని, ఇందుకు రూ.3లక్షల వరకు ఖర్చవుతుందని డాక్టర్లు తెలిపారు. వైద్యం చేయించడానికి ఆర్థిక స్తోమత లేక ఆపన్నహస్తం కోసం ఎదురు చూస్తుండగానే శనివారం రాత్రి మృతిచెందాడు. ఆదివారం రాత్రి రాజు భౌతికకాయానికి స్వగ్రామంలో అంత్యక్రియలు నిర్వహించారు. మృతుడికి భార్య దుర్గమ్మ, కుమారుడు, కుమార్తె ఉన్నారు. మృతుడు కిరాయి ఇంట్లో నివాసం ఉంటున్నాడని, అతడి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని తెలంగాణ చేనేత జన సమాఖ్య జిల్లా అధ్యక్షుడు కర్నాటి పురుషోత్తం, గౌరవ అధ్యక్షుడు వేశాల మురళి కోరారు.

యాదగిరిగుట్టలో శ్రీరామనవమి వేడుకలు



యాదగిరిగుట్ట: సీతారామచంద్రస్వామి కల్యాణం జరిపిస్తున్న పూజారులు

యాదగిరిగుట్ట: యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి క్షేత్రానికి అనుబంధంగా కొనసాగుతున్న శ్రీపర్వతవర్ధిని రామలింగేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం శ్రీరామనవమిని పురస్కరించుకొని సీతారామచంద్రస్వామి కల్యాణాన్ని పూజారులు వైభవంగా నిర్వహించారు. సీతారామచంద్రస్వామికి ఉదయం విశేష పూజలు జరిపించి, 11.30గంటలకు శివాలయంలో స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి సేవను ఊరేగించారు. యాదగిరిగుట్ట దేవాలయం తరఫున అనువంశిక ధర్మకర్త బి. నర్సింహమూర్తి దంపతులు, ఈఓ భాస్కర్‌రావు, ఆలయ అధికారులు, అర్చకులు పట్టువస్త్రాలను సమర్పించారు. అనంతరం శివాలయం ఉత్తర దిశలోని కల్యాణ మండపంలో సీతారాముల కల్యాణ వేడుకను వైభవంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో ట్రైబల్ వెల్ఫేర్ సెక్రటరీ శరత్, రియల్ ఎస్టేట్ రెగ్యులేటరీ అథారిటీ(రెరా) చైర్మన్ ఎన్. సత్యనారాయణ, యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు దంపతులు, ఆలయ అధికారులు, పూజారులు, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు. సోమవారం మధ్యాహ్నం 12.30గంటలకు సీతారామచంద్రస్వామికి పట్టాభిషేకం జరిపించనున్నారు.

స్వర్ణగిరి దేవాలయంలో..

భువనగిరిటౌన్: భువనగిరి పట్టణ సమీపంలోని స్వర్ణగిరి శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయంలో ఆదివారం శ్రీరామనవమి వేడుకలను ఘనంగా నిర్వహించారు.



స్వామివారిని ఊరేగింపుగా తీసుకొస్తున్న అర్చకులు, ఈఓ, అనువంశిక ధర్మకర్త తదితరులు



భువనగిరిటౌన్: స్వర్ణగిరిలో సీతారాముల కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

రంగస్థల కళాకారులకు ఆదరణ కరువు



పల్నాటి యుద్ధం నాటకాన్ని ప్రదర్శిస్తున్న కళాకారులు (ఫైల్)



సత్యహరిశ్చంద్ర నాటకాన్ని ప్రదర్శిస్తున్న కళాకారులు (ఫైల్)

- సినిమాలు, టీవీ షోల ప్రభావంతో ఉనికి కోల్పోతున్న కళాకారులు
- ఆర్థిక సమస్యలతో సతమతమవుతున్న కుటుంబాలు
- ప్రభుత్వ సహాయం కోసం ఎదురుచూపు

మఠంపల్లి: ఎంతో మంది ప్రజలకు తమ కళల ద్వారా వినోదం, ఆనందం పంచిన, పంచుతున్న రంగస్థల కళాకారుల కుటుంబాలకు నేడు గ్రామాల్లో ఆదరణ కరువైంది. నాటి చరిత్ర, ఇతిహాస, పురాణాలే కాకుండా సమాజంలో నెలకొంటున్న పరిస్థితులపై ప్రజలను చైతన్యవంతులను చేసేందుకు సాంఘిక, పౌరాణిక, బుర్రకథ, జానపదాలతో ప్రజలకు మేలుకొలుపు కలిగిస్తూ కళా ప్రదర్శనలు ఇచ్చిన కుటుంబాలు నేడు ఆర్థిక సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నాయి. ఒక పక్క ప్రపంచీకరణ నేపథ్యంలో వచ్చిన మార్పులను తట్టుకుంటూనే రంగస్థలాన్ని కాపాడుకుంటూ గ్రామాల్లో, పట్టణాలలో సైతం స్టేజీలపై తమ స్వంత ఖర్చులు, కొంతమేర దాతల సహకారంతో నాటకాలు ప్రదర్శిస్తున్నారు. అయితే ప్రభుత్వం మాత్రం సమాజంలోని అనేక రంగాల వారికి వివిధ రూపాలలో ఆదుకుంటున్నా రంగస్థల కళాకారుల ప్రదర్శనలకు ఎలాంటి ఆర్థిక సహకారం అందించడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సూర్యాపేట జిల్లాలోనే సుమారు 2000మందికి పైగా కళాకారులు సుమారు 120నాటక సమాజాలను రిజిష్టర్ట్ చేయించుకుని తమ సొంత ఖర్చులతో సత్యహరిశ్చంద్ర, బాలనాగమ్మ, చింతామణి, శ్రీకృష్ణరాయబారం, రామాంజనేయ యుద్ధం, పల్నాటి యుద్ధం నాటకాలు ప్రదర్శిస్తున్నారు.

10ఏళ్లుగా పట్టించుకోని ప్రభుత్వాలు..

గతంలో ప్రభుత్వం పలురకాల కార్యక్రమాలకు జనాభా నియంత్రణ, మద్యపానం, చదువు వెలుగు, పుష్కరాలు తదితర కార్యక్రమాలను కళాకారులతో జిల్లా పౌరసంబంధాల శాఖ ద్వారా పనులు కల్పించేవారు. సుమారు 10 సంవత్సరాలుగా ప్రభుత్వం నుంచి కళాకారులకు ఎలాంటి ఆదరణ దక్కడం లేదు. ముఖ్యంగా రంగస్థల కళాకారులకు కేంద్ర రూ.6వేలు, రాష్ట్ర రూ.3వేలు చొప్పున పింఛన్లు ఇస్తుంటారు. అయితే రాష్ట్ర ప్రభుత్వం 10ఏళ్లుగా, కేంద్రం 4ఏళ్లుగా పింఛన్లు ఇవ్వకుండా వదిలేశారు. జిల్లాలో 200మంది మాత్రమే పింఛన్లు మంజూరైన వారు ఉన్నారని, కొత్త పింఛన్ల కోసం కళాకారుల యూనియన్ నాయకులు పలుమార్లు హైదరాబాద్, ఢిల్లీ వరకు వెళ్లినట్లు తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వాలు నిరుపేద రంగస్థల కళాకారులకు పింఛన్లు, ఇండ్లు, రైలు, బస్‌పాసులు, హెల్త్‌కార్డులు, సమాచార పౌరసంబంధాల శాఖ ద్వారా గుర్తింపు కార్డులు జారీ చేయాలని కోరుతున్నారు.

ప్రజావాణిలోనూ విన్నవించాం



కళాకారులకు గుర్తింపు కార్డులు, పింఛన్లు, బస్‌పాస్‌లు ఇప్పించాలని ఈ ప్రభుత్వం వచ్చిన రెండునెలలకే హైదరాబాద్ వెళ్లి సీఎం ప్రజావాణిలో వినతిపత్రాలు అందజేశాం. నేటికీ ఆ ఊసేలేదు. పేద కళాకారులు ఎంతో ఆశతో ప్రభుత్వ సహాయం కోసం ఎదురు చూస్తున్నారు.

– భద్రంరాజు వెంకటరామారావు, కళాకారుల సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు

పింఛన్ల కోసం ఢిల్లీకి వెళ్లి వచ్చాం



పేదరికంలో ఉన్న కళాకారులకు పింఛన్లు ఇప్పించాలనే తపనతో ఢిల్లీకి పలుమార్లు వ్యయ ప్రయాసలతో వెళ్లివచ్చాం. అయినప్పటికీ రెండు ప్రభుత్వాలు పేద కళాకారులను పట్టించుకోవడంలేదు. వెంటనే అర్హులైన వారికి పింఛన్లు మంజూరు చేసి వారి సంక్షేమానికి నిధులు విడుదల చేయాలి.

– బోనగిరి ప్రకాష్‌బాబు, కళాకారుల సంఘం హుజూర్‌నగర్ నియోజకవర్గ అధ్యక్షుడు

కేవలం 200 మందికే పింఛన్లు



జిల్లాలో నిరుపేద కళాకారులు వేలమంది ఉన్నారు. కేవలం 200 మందికి మాత్రమే పింఛన్లు మంజూరయ్యాయి. అవి కూడా పెండింగ్‌లోనే ఉంటున్నాయి. ప్రభుత్వం సమాజ హితం కోసం ఏళ్ల తరబడి పనిచేస్తున్న కళాకారులను పట్టించుకోవాలి. అధికారులు దరఖాస్తులు వెంటనే పరిశీలించి కొత్త పింఛన్లు మంజూరు చేసి ఆదుకోవాలి.

– కంబాల శ్రీనివాస్‌నాయుడు, కళాకారుల సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరికి గాయాలు

కేతేపల్లి: హైదరాబాద్–విజయవాడ జాతీయ రహదారిపై కేతేపల్లిలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కేతేపల్లి మండలం కొత్తపేట గ్రామానికి చెందిన ఎస్‌కే ఇమాం ఆదివారం సాయంత్రం బైక్‌పై కేతేపల్లిలోని ఎస్సీ కాలనీ సమీపంలో జంక్షన్ వద్ద హైదరాబాద్–విజయవాడ జాతీయ రహదారిని దాటుతుండగా విజయవాడ నుండి హైదరాబాద్ వైపు వెళ్తున్న కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఇమాంకు తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న కేతేపల్లి 108 అంబులెన్స్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం నకిరేకల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

కారు ఢీకొని..

వలిగొండ: బైక్‌పై వెళ్తున్న యువకుడిని కారు ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. ఈ ఘటన వలిగొండ మండలం వర్కట్‌పల్లి గ్రామంలో ఆదివారం జరిగింది. వివరాలు.. వర్కట్‌పల్లి గ్రామానికి చెందిన బండి వినయ్‌కుమార్(27) బైక్‌పై సంగెం గ్రామం వైపు వెళ్తుండగా.. వర్కట్‌పల్లి గ్రామ శివారులో ఎదురుగా వస్తున్న కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో వినయ్‌కుమార్‌కు తీవ్ర గాయాలయ్యాయి. అటుగా వెళ్తున్న ప్రయాణికులు 108 సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో వారు ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రుడిని భువనగిరి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

అక్రమంగా తరలిస్తున్న ఎద్దుల పట్టివేత

చౌటుప్పల్‌రూరల్: అక్రమంగా కబేళాకు తరలిస్తున్న ఎద్దులను ఆదివారం చౌటుప్పల్ పోలీసులు పట్టుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్‌లోని బహదూర్‌పురాకు చెందిన ఎండీ హాజీ కోదాడ సంతలో 10 ఎద్దులను కొనుగోలు చేసి వాహనంలో హైదరాబాద్‌లోని కబేళాకు తరలిస్తుండగా.. వాహనాల తనిఖీల్లో భాగంగా ఆదివారం చౌటుప్పల్ మండలం అంకిరెడ్డిగూడెం గ్రామ స్టేజీ వద్ద పోలీసులు పట్టుకున్నారు. ఈ మేరకు హాజీపై కేసు నమోదు చేసినట్లు సీఐ మన్మథకుమార్ తెలిపారు.

కవులు సమాజాన్ని చైతన్యపరచాలి



నార్కట్‌పల్లి: కవులకు బహుమతులు అందజేస్తున్న రఘువీర్ ప్రతాప్ తదితరులు

నార్కట్‌పల్లి: కవులు తమ రచనల ద్వారా సమాజాన్ని చైతన్యపరచాలని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం కీర్తి పురస్కార గ్రహీత ఎన్వీ రఘువీర్ ప్రతాప్ అన్నారు. నార్కట్‌పల్లి మండలం చెర్వుగట్టులోని శ్రీసోమేశ్వర శివజ్ఞాన పీఠం ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన కవి సమ్మేళనంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కవి సమ్మేళనంలో రెండు తెలుగు రాష్ట్రాల నుంచి సుమారు 67 మంది కవులు పాల్గొన్నారు. అనంతరం కవులకు బహుమతులు అందజేశారు. శివజ్ఞాన పీఠం ట్రస్ట్ అధ్యక్షుడు పోతులపాటి అరుణ రామలింగేశ్వర శర్మ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సిలువేరు సాహితీ సంస్థ, తేజస్విని సాహితీ సంస్థల అధ్యక్షుడు సిలువేరు లింగమూర్తి, పెందోట సోము, సినీ పాటల రచయిత బండారు దానయ్య, తండు కృష్ణకౌండిన్య, పున్న అంజయ్య, పెరుమాళ్ల ఆనంద్, భాను శ్రీకొత్వాల్, సాగర్ల సత్తయ్య, ఝూన్సీ, ప్రవీణ్‌రెడ్డి, రాజేందర్‌శర్మ, జయారపు రామకృష్ణ, హరికృష్ణశర్మలు తదితరులు ఉన్నారు.

బుచ్చిరెడ్డి దంపతులకు సన్మానం

కనగల్: నార్కట్‌పల్లి మండలం చెర్వుగట్టులోని శ్రీసోమేశ్వర శివజ్ఞాన పీఠం ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించి కవి సమ్మేళనంలో కనగల్ మండలం చిన్నమాదారం జెడ్పీహెచ్ఎస్ ఉపాధ్యాయుడు కోమటిరెడ్డి బుచ్చిరెడ్డి పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబరిచారు. ఈ సందర్భంగా ఆయనను ఆలయ ప్రధాన అర్చకుడు రామలింగేశ్వర శర్మ, కీర్తి పురస్కార గ్రహీత రఘువీర్ ప్రతాప్ సన్మానించారు. కార్యక్రమంలో పెందోట సోము, సిలువేరు లింగమూర్తి, పోతులపాటి అరుణ, శివ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తు వరికోత మిషన్ దగ్ధం



హార్వెస్టర్‌కు అంటుకున్న మంటలను ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది

కేతేపల్లి: వరి పంట కోస్తుండగా ఇంజన్‌లో మంటలు చెలరేగి హార్వెస్టర్(వరికోత మిషన్) దగ్ధమైంది. ఈ ఘటన కేతేపల్లి మండలం చెర్కుపల్లి గ్రామంలో శనివారం రాత్రి జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. చెర్కుపల్లి గ్రామానికి చెందిన చినబోయిన చిరంజీవికి చెందిన చైన్ హార్వెస్టర్‌తో శనివారం రాత్రి స్థానిక రైతు పొలం కోస్తుండగా ఇంజన్‌లో సాంకేతిక లోపం ఏర్పడి మంటలు లేచాయి. నిమిషాల వ్యవధిలోనే మంటలు ఎగిసిపడి వరికోత మిషన్‌కు అంటుకున్నాయి. సమాచారం అందుకున్న నకిరేకల్ ఫైర్ సిబ్బంది ఘటనా స్థలం వద్దకు చేరుకున్నారు. హార్వెస్టర్‌కు అంటుకున్న మంటలను ఆర్పినప్పటికీ అప్పటికే యాభైశాతం మేర కాలిపోయింది. యాసంగి వరికోతలు ప్రారంభం కావటంతో హార్వెస్టర్ ఇంజన్‌కు ఇటీవలే మరమ్మతులు చేయించినట్లు తెలిసింది.

తాళం వేసిన ఇంట్లో చోరీ

- 7తులాల బంగారం, వెండి ఆభరణాలు ఎత్తుకెళ్లిన దుండగులు

మునుగోడు: మునుగోడు మండలం కచలాపురం గ్రామంలో తాళం వేసిన ఇంట్లో ఆదివారం గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. వివరాలు.. కచలాపురం గ్రామానికి చెందిన మారెడ్డి శ్రీనివాస్‌రెడ్డి దంపతులు ఆదివారం ఉదయం ఇంటికి తాళం వేసి తమ వ్యవసాయ బావి వద్దకు వెళ్లారు. వారి ఇల్లు గ్రామ శివారులో ఉండటంతో తాళం వేయడం గమనించిన గుర్తుతెలియని వ్యక్తులు మధ్యాహ్నం తాళం పగులగొట్టి ఇంట్లోకి చొరబడి బీరువాలోని సుమారు 7తులాల బంగారంతో పాటు వెండి ఆభరణాలు ఎత్తుకెళ్లారు. సాయంత్రం వ్యవసాయ బావి వద్ద నుంచి శ్రీనివాస్‌రెడ్డి దంపతులు ఇంటికి వచ్చేసరికి తాళం పగులగొట్టి ఉండటంతో పాటు బీరువాలోని వస్తువులు చిందరవదరగా పడేసి ఉండటం గమనించి చోరీ జరిగినట్లు గుర్తించారు. పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్ఐ రవి ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు.